ప్రజాశక్తి
శనివారం 2 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భామిని

ఎపి మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 1నుంచి 31 వరకు www.cse.ap.gov.in or www.apms.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉన్న విద్యార్థులు అప్లై చేసుకోవచ్చని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. పరీక్షా రుసుము ఒసి, బిసిలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఆరో తరగతి ప్రవేశాలపై ప్రవేశ పరీక్షలో ఒసి, బిసి విద్యార్థులు 35 మార్కులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కనీసం 30 మార్కులు పొందాలన్నారు. ఏప్రిల్ 21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు... ప్రిన్సిపల్ ,ఏపీ మోడల్ స్కూల్ భామిని 9440322964 , 9502579287, 8121187901,లను సంప్రదించవలెను

తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

- మొదటి సంవత్సరం పరీక్షకు 814 మంది గైర్హాజరు
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపిన సిబ్బంది

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 8.30 గంటలకు విద్యార్థులను లోపలికి అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించలేదు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదని ముందే ప్రకటించడంతో పరీక్ష రాసే విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. దూర ప్రాంతాలకు చెందిన వారు 8 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. మరో వైపు విద్యార్థులను వారి తల్లిదండ్రుల బైక్‌లు, ఆటోలపై తీసుకొని రావడం జరిగింది. విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాల్ టికెట్, పెన్, అట్ట తప్ప ఎటువంటి ఇతర వస్తువులు లోపలికి అనుమతించలేదు. మొదటి ఏడాది పరీక్ష రాస్తుండడంతో విద్యార్థులు తమ వెంట వచ్చిన తల్లిదండ్రులు వచ్చి శుభాకాంక్షలు చెప్పి పంపించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమైంది.

పరీక్ష ప్రశాంతం ఆర్ఐఒ

మొదటి రోజు ఇంటర్మీడియట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ తెలిపారు. 6208 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5869 మంది హాజరు అయ్యారని, 339 మంది గైర్హాజరు అయ్యారని ఆమె అన్నారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 3420 మంది రాయాల్సి ఉండగా 2945 మంది హాజరయ్యారని, 475 గైర్హాజరు అయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 32 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన ఏఎస్పీ

ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరిగేలా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ తెలిపారు. పట్టణంలోని భాస్కర్ జూనియర్ కళాశాల, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపుఎస్పీ సందర్శించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపెరింటెండెంట్స్, ఇతర అధికారులు అనుసరించాల్సిన నిబంధనలపై పలు సూచనలు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. తగిన ఎస్కార్ట్ తో ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పారంభమైన ఇంటర్ మొదటి సంవత్సర పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కుమారస్వామి తెలిపారు. ఈ పరీక్షకు 260 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా జనరల్ తెలుగు పరీక్ష సంబంధించి 13 మంది విద్యార్థులు, జిపిఎఫ్ సంబంధించి ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. డిపార్ట్మెంట్ అధికారి ఎస్.నాగభూషణరావు పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు.

కురుపాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.ఉషారాణి పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. 624 మంది విద్యార్థులకు 112 మంది విద్యార్థులు పరీక్షకు గైరాజరయ్యారని, ఒకేషనల్ 556 మందికి 107 మంది విద్యార్థులు గైర్హాజవ్వగా జనరల్ 68మంది విద్యార్థులకు 5 గురు విద్యార్థులు గైరాజరైనట్లు ఆమె తెలిపారు. డిఒలుగా డి.తవిటినాయుడు, పిసి శర్మ వ్యవహరించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. భద్రగిరి పిటిజి, భద్రగిరి బాలురు గురుకుల కళాశాల, జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పిటిజిలో 281 మంది విద్యార్థులకు తెలుగు 247 , హిందీ 18 మంది విద్యార్థుల పరీక్షలు రాశారు. భద్రగిరి బాలుర పాఠశాలలో 369 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారు. ప్రభుత్వ జూని యర్ కళాశాలలో 431 మందికి 351 మంది హాజరై పరీక్షలు రాశారు. 80 మంది గైర్హాజర య్యారు. ఎటువంటి అవాంఛ నీయ సంఘట నలు జరగ కుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు 144 సెక్షన్ విధిం చారు. ఎల్విన్ పేట ఎస్ఐ బి శివ ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఒ మంజులవీణ

సీతంపేట : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికల గురుకుల కళాశాలలో 224 మంది విద్యార్థులకు 222 పరీక్షలు రాశారు. ఇద్దరు గైరాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రంలో బాలికల కళాశాల విద్యార్థులు మల్లి ప్రతిభ కళాశాల విద్యార్థులు బాలుర కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే ఐటిడిఎలో ఉన్న బాలుర గురుకుల కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 273 మంది విద్యార్థులకు 268 మంది పరీక్షలు రాశారు. తెలుగు పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. డిపార్ట్మెంటు అధికారులుగా సూర్యకుమారి, నాగభూషణరావు వ్యవహరించారు.

కురుపాం : హాల్‌టిక్కెట్ల నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

సీతానగరం: మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాధారణ కోర్సుల్లో 104మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరు కాగా, 102మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ దాసరి త్రినాథ్ తెలిపారు. వృత్తివిద్యా కోర్సుల పరీక్షలకు సంబంధించి 160మంది విద్యార్థులకు గానూ 128 హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ దాసరి త్రినాథ్ తెలిపారు. జోగింపేట ప్రతిభా కళాశాలలో 157మందికి గాను ఆరుగురు అబ్సెంటు కాగా, 151మంది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పోల వెంకట నాయుడు తెలిపారు. సుకన్య, ధనలక్ష్మి డిపార్టుమెంటు అధికారులుగా వ్యవహరిస్తున్నారు.

బలిజిపేట : మండలంలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి, మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పిఎస్ఎన్ కళాశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 307 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా తొలిరోజు 20 మంది గైర్హాజరయ్యారు.

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్ జి. సత్యనారాయణ, డిపార్ట్మెంటల్ అధికారి జి తేజేశ్వర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మొదట పరీక్షకు 286 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 267 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారని డిఒ తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతున్నాయని అన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసులను ఆర్‌టిసి కల్పించినట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుటకు, ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొనేందుకు కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణ - పంపిణీ, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన కంట్రోల్ రూం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఫారం 7, 8లపై అభ్యంతరాలను సేకరిస్తున్నామన్నారు. వీడియో, ఫోటో గ్రాఫర్ల నియమాకాలకు చర్యలు తీసుకోవడం జరిగిందని, ఎన్ఫోర్స్ మెంట్ ఏజన్సీలను నియమించామన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టరు సి. విష్ణుచరణ్, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, వి.వి.రమణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి -పార్వతీపురం

జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా జిల్లాలోని వివిధ కాలేజీల్లో చదువుతున్న 18,369 విద్యార్థిని, విద్యార్థులకు రూ.12.32 కోట్లు చెక్కును కలెక్టరు నిశాంత్ కుమార్ అందజేసారు. శుక్రవారం కృష్ణాజిల్లా పామర్రు నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్టోబరు-డిశంబరు 2023 త్రైమాసానికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన పథకం నిధులు రూ.708.68కోట్లును బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోనికి విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి జగనన్న విద్యాదీవెన పథకం నిధుల పంపిణీ కార్యక్రమంలో నిశాంత్ కుమార్, ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌తో కలిసి లబ్దిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చదువుతున్న 18,369మంది విద్యార్థులకు ఈ త్రైమాసానికి సంబంధించిన ఫీజులు రూ.12,32,71,458 పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి. గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటేసేందుకు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి -పార్వతీపురం

రానున్న లోక్‌సభ, శాసన సభ సాధారణ ఎన్నికల్లో విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కును వినియోగించుకోవడంలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎ.రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో స్పందన సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగిం చుకోవడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఓటు నమోదు చేసుకోవడంతో పాటు ఓటును వినియోగించుకోవడం ఓటరు బాధ్యతని ఆయన తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం దివ్యాంగులకు సాక్ష్యం యాప్‌ను రూపొందించిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుందన్నారు. పోలింగ్ రోజున దివ్యాంగులకు సులభతరంగా ఓటు నమోదుపై ప్రత్యేకమైన ఏర్పాట్ల సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కేంద్ర ఎన్నికల సంఘం దివ్యాంగుల్లో చైతన్యం కలిగించి ఓటు హక్కు వినియోగిం చుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులను గుర్తించి ఇంటి వద్ద నుంచి ఓటు వేసేలా ఏర్పాటు చేశారని తెలిపారు. ఓటు నమోదు చేసుకోకుండా ఉన్నవారుంటే ఫారం 6 అలాగే తప్పులను సరి చేసుకోవడానికి ఫారం 8 ను ఉపయోగించుకునే లాగా ఆన్లైన్ ద్వారా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. అవగాహన కార్యక్రమంలో అంధ దివ్యాంగులైన వారికి ఇవిఎంల ద్వారా బ్రెయిలీ లిపి ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారిని కె.కవిత ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ, 18 ఏళ్ల దాటిన వికలాంగులంతా ఓటరుగా నమోదు కావాలని అన్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులతో ఓటు హక్కు సద్వినియోగంపై నినాదాలు చేయించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు, పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సంస్థల సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎంఎస్ఎంఇ సంస్థల సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) సర్వే శుక్రవారం ప్రారంభమైంది. కలెక్టర్ నిశాంత్ కుమార్ సర్వే వివరాల పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్ సర్వే వివరాలు అందించారు. ఎంఎస్ఎంఇల పని తీరును మెరుగు, అభివృద్ధిని వేగవంతానికి కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకం కింద సర్వే జరుగుతుందని చెప్పారు. ఎంఎస్ఎంఇల సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని సంస్థలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి ఎపిఎంఎస్ఎంఇ వన్ పోర్టల్‌ను అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్ఎంఇ ఫార్మలైజేషన్ ముఖ్యోద్దేశమన్నారు. పరిశ్రమల శాఖ ఎపి ఎంఎస్ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో సర్వే నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. సర్వే కోసం ఎం ఎస్ ఎం ఇ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ ఆప్ ను రూపొందించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వేను ఈనెల 20 వరకు చేపడతారని ఆయన చెప్పారు. ఎం ఎస్ ఎం ఇ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే టీమ్ కు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణు చరణ్, ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, డిఆర్ఒలు కె.హేమలత, వెంకట రమణ, పరిశ్రమలశాఖ ఎడి పి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం వ్యాఖ్యలు అర్ధరహితం : సిపిఎం

ప్రజాశక్తి-సాలూరు

సిపిఎం, గిరిజన సంఘాల నాయకుల పట్ల డిప్యూటీ సిఎం రాజన్నదొర చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, మెంటాడ మండల సిపిఎం కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 'పోరాటాలు, ధర్నాలతో సమస్యలు పరిష్కారం కావు' అన్న డిప్యూటీ సిఎం మాటలను వారు ఖండించారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని తాము గట్టిగా విశ్వసిస్తున్నామని చెప్పారు. అలాంటి పోరాటాలు, ధర్నాలను హేళన చేస్తూ మంత్రి రాజన్నదొర మాట్లాడడం తగదన్నారు.

గిరిజనులు, దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే మంత్రి రాజన్నదొర వినతి తీసుకోకుండా ఎదురు దాడి చేయడం తగదని హితవుపలికారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు వైసిపి నాయకులు పోరాటాలు, ధర్నాలు చేయలేదా అని ప్రశ్నించారు. షెడ్యూల్‌లో లేని గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపడానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ, గిరిజన సంఘాలు మొదటి నుంచి పోరాడుతున్నాయని గుర్తు చేశారు. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. మెంటాడ మండలంలో రిజర్వ్ ఫారెస్ట్ భూములను కైంకర్యం చేయడానికి కొంతమంది నాయకులు ప్రయత్నిస్తుంటే రాజన్నదొర ఎందుకు మౌనంగా వున్నారని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం జగన్ రెడ్డి ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తే పోరాడుతున్నది సిపిఎం, గిరిజన సంఘాలేనని రాజన్నదొర తెలుసుకోవాలని సూచించారు. అగ్రిగోల్డ్, అక్షయ్ గోల్డు మరియు పెత్తందారుల చేతుల్లోని ఉన్న భూములను గిరిజనులకు, పేదలకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఆంధ్ర జలాశయంలో గిరిజనులకు చేపలు పట్టుకునే హక్కు కల్పించలేదని, సొసైటీ ఏర్పాటు చేసి వారికి అప్పజెప్తామని రాజన్నదొర ఇచ్చిన హామీని నెరవేర్చలేదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా, గిరిజన శాఖ మంత్రిగా చిత్త శుద్ధితో గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గిరిజన హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

కేక్ కట్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వేతనాల పెంపుపై హర్షం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు రూ.21వేల వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తూ శుక్రవారం ప్రభుత్వ ఆదేశాలను విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. పెరిగిన వేతనానికి సంబంధించిన నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా కార్మికుల విజయోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం సాలూరు పట్టణంలో చేపట్టారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వై నాయుడు, సాలూరు కమిటీ అధ్యక్షులు రాముడు, శంకర్రావు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ముందుగా కేక్ కట్ చేసి కార్మికులకు విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధానమైన సమస్యల్లో జీతం సమస్య పరిష్కరించినప్పటికీ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసేదానిలో హామీ నెరవేర్చలేదని, కావున భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు పురపాలక సంఘాల్లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యను పరిష్కరించే దిశగా వారి వారి మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మహిళా నాయకులు ఇందూ, సీత, స్వప్న, కమిటీ నాయకులు రవి, శ్రీను, వెంకట్రావు, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొటియా గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం పరిశీలించారు. నేరెళ్ళవలసలో గల పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కొటియా సిఐలు రేవతీపతి, నారాయణరావు, రూరల్ సిఐ బాలకృష్ణ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు గురించి వివరించారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. వీరి వెంట రూరల్ ఎస్ఐ ఎంవి రమణ వున్నారు.

దోనుబాయిలో వైద్య శిబిరం

సీతంపేట: మండలంలోని దోనుబాయిలో శుక్రవారం మెడికల్ క్యాంపు ఆ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు మాట్లాడుతూ వైద్య శిబిరాలను గిరిజనులు వినియోగించుకోవాలని కోరారు. వైద్యాధికారులు మీ ముంగిటకు వచ్చి వైద్య సేవలందిస్తున్నారని దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఏడుగురు వైద్యాధికారుల బృదాలతో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పాలకొండ సిఐ చంద్రమౌళి, సీతంపేట, దోనుబాయి ఎస్సైలు ఎం.జగదీష్‌నాయుడు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు డిప్యూటీ సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర శుక్రవారం పాల్గొన్నారు. కొత్తవలసలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.75 కోట్ల అంచనా విలువతో నిర్మించిన అదనపు వసతి గదులను, కోటి రూపాయలతో నిర్మించే వంట గది, భోజనశాలలకు శంకుస్థాపన చేశారు. అలాగే మూలవలసలో కొత్తగా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, గ్రామస్తులతో మమేకమయ్యారు. పాఠశాల బాలికలు ఆనంద కోలాహలంతో నృత్యాలతో స్వాగతం పలికారు. పిల్లలందరితో నేరుగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, వీటిని వినియోగించుకొని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరాలని పిలుపునిచ్చారు. 8వ తరగతి విద్యార్థులకు టాబ్‌లను అందజేసి డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు అందించేలా ఇంటర్నేషనల్ బకలారియట్‌తో ఒప్పందం చేసుకోవడం, వివిధ విదేశీ విశ్వ విద్యాలయాల నుండి సర్టిఫికేట్ జారీ వంటి చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపు నిస్తూ విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉండాలని, ఒత్తిడి లేని విద్యను అభ్యసించాలని హితవుపలికారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇటీవల మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం, వంతెనల నిర్మాణానికి పనులు ప్రారంభించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



నియామకపత్రాలను అందజేస్తున్న అధికారులు

జాబ్ మేళాలో 112 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 112 మంది ఎంపికయ్యారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించారు. జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాకు 386 మంది హాజరు కాగా, అందులో 112 మంది వివిధ కంపెనీలో ఎంపికయ్యారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగం పొందాలని కోరారు. ఎన్‌వైకె జిల్లా కోఆర్డినేటర్ కె.వెంకట్‌ఉజ్వల్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఉద్యోగ మేళా నిర్వహించడం సంతోష దాయకమన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు రాబోయే రోజుల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ మరిన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, శ్రీ సత్య సాయి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస రావు, బి.లక్ష్మీనారాయణ, డివి రమణ పాల్గొన్నారు.

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నెరవేరిన సొంతింటి కల

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పేదల సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మునిసిపల్ పరిధిలో ఉన్న 23, 24 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగనన్న లేఅవుట్లలో స్థలాలు వచ్చిన వారికి ఆ లేఅవుట్ రద్దు కావడంతో అక్కడి వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంకంపేట ప్రాంతంలో గల జగనన్న లేఅవుట్లో ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. అక్కడ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు అందరికీ వార్డుల వారీగా పట్టాలను అందజేశామన్నారు. ఈ వ్యవహారంలో ఎటువంటి వివక్షత, అవినీతికి తావు లేకుండా పట్టాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ మంత్రి ఉమామహేశ్వరి, జెసిఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవరావు, కన్వీనర్లు ఆకుల శ్రీనివాసరావు, గృహసారథులు, కార్యకర్తలు, వాలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత సభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నాలుగో విడత అర్హులైన మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని మండలంలో ఈనెల 10న స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభించనున్న నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఎపిఎం పి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విఒలు, మహిళా సంఘాల సభ్యులతో ఉల్లిభద్రలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల10న జరగనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిసిలు చందాన తిరుపతిరావు, చింతాడ ప్రసాద్, బొంగు రామినాయుడు, కింజంగి కృష్ణ, వి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పూర్తయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి రహదారి పనులు పూర్తయ్యేదెప్పుడని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. చిదిమి గ్రామ రహదారి నిర్మాణానికి రూ.కోటి 41 లక్షలు నిధులు మంజూరయ్యాయని గత ఏడాది జులై 21న స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అప్పట్లో అట్టహాసంగా భూమి పూజ చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో కొంతకాలంగా పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు ఉపాధిహామీ నిధులు కోటి 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు సీతంపేట ఐటిడిఎ పర్యవేక్షణలో ఉపాధిహామీ చట్టం ద్వారా నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. సీసీస్ట్ రహదారి నుండి చిదిమి రోడ్డు వరకు ఇరువైపులా జెసిబితో మట్టి పనులు చేపట్టారు. రోడ్డు పూర్తిగా తవ్వకాలు జరిపి వాటి పైన 40 ఎంఎం చిప్స్ వేసి రోలింగ్ చేసి అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో రాళ్లుతేలిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి దాదాపుగా ఎనిమిది నెలలు కావస్తున్న పనుల్లో పురోగతి లేకపోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. చిదిమి రహదారి నిర్మాణ పనులు,

రాళ్లు తేలిన రహదారి

వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణం అభివృద్ధి పనులు చేపట్టిన గుత్తేదారు ఒక్కరే కావడం గమనార్హం. స్థానిక ఎంపిపి గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులు ఎందుకు మరి పట్టెం గురించి వేగేగా చేయాల్సిన అవసరం లేదు. ఈ విషయమై ఎపిఇ వై.సత్యం నాయుడు వద్ద 'ప్రజాశక్తి' వివరణ కోరగా ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి రూ.27 లక్షల వరకు రికార్డు చేశామని, ఉన్నతాధికారి ఆమోదం తెలిపితే వెంటనే నిధులు గుత్తేదారుకు చెల్లించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు వెంటనే విడుదల చేయాలని సంఘం పట్టణ అధ్యక్షులు రౌతు చిన్నయ్య, కోశాధికారి నెయ్యిల మోహన్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం వారి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాసిందన్నారు. సంక్షేమ బోర్డులో వున్న 2వేల కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం వల్ల కార్మికులు సంక్షేమ పథకాలు నోచుకోలేదని చెప్పారు. మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటయిందని అలాంటి బోర్డుని నిర్వీర్యం చేసే విధంగా వైసిపి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. వెంటనే నిధులు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోతి పక్క నుంచే ప్రమాదకరంగా వెళుతున్న విద్యార్థినులు

ప్రమాదపుటంచున ప్రయాణం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేటును మార్చడంలో భాగంగా ఇరువైపులా సిమెంట్ పిల్లర్స్ నిర్మించేందుకు గోతులు తవ్వారు. పిల్లర్స్ వేసినప్పటికీ మట్టితో గోతులను కప్పకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం కళాశాలలో పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థులు గోతులు దాటుకొని రావటం వల్ల పొరపాటున కాలు జారితే ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నుంచి గుణుపూర్ వెళ్లే ప్రధాన బిటి రోడ్డు నుంచి మండలంలోని గుమ్మ పంచాయతీలో గల కొనగూడ గిరిజన గ్రామానికి రూ.కోటీ 20 లక్షలు ఉపాధి హామీ నిధులతో మంజూరైన 1.5 కిలోమీటర్ల మేరకు బిటి రోడ్డు పనులకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించి ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కావున ప్రజలు ఇవన్నీ గమనించి మరోసారి వైసిపి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి తమ గ్రామానికి బిటి రహదారి లేక అనేక ఇబ్బందులు పడ్డామని ఎమ్మెల్యే చొరవ తీసుకొని రహదారి మంజూరు చేయించినందుకు గ్రామస్తులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.గోపాలరావు, ఎంపిపి శెట్టి పద్మావతి,

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జెడ్పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, ఐటిడిఎ ఇంజనీరింగ్ అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: కోట్లాది రూపాయలు వ్యయంతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి అన్నారు. పార్వతీపురం శ్రీకాకుళం ఆర్ అండ్ బి ప్రధాన రహదారి జంక్షన్ నుంచి పిట్టలమెట్ట గ్రామం వరకు దాదాపు రూ.1.40కోట్లతో నిర్మాణం చేపట్టనున్న తారురోడ్డు నిర్మాణం పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణితో పాటు మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు శంకుస్థాపన చేశారు. ఆనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనుంజయరావు, వైసిపి నాయకులు అంబటి గౌరునా యుడు, మంత్రబుడ్డి బలరాము నాయుడు, మంత్రబుడ్డి పార్వతమ్మ, అశోక్ బ్రహ్మ, గుంట్రెడ్డి చంద్రశేఖ రరావు, ఎం శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అడ్డాపుశీలలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో అడ్డాపుశీల గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థుల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కరస్పాండెంట్ పెంట అప్పారావు, ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుండి 7వ తేదీ వరకు అడ్డాపుశీల గ్రామాన్ని దత్తత తీసుకొని జాతీయ సేవా పథకం కార్యక్రమాలు చేపడతామన్నారు. వారం రోజుల్లో ప్రతిరోజు గ్రామంలో సర్వే నిర్వహించి, పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, రోడ్లు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డి దేవి, తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ కె పోలమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల బారిన పడకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - కురుపాం

దోమల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటి బారిన పడకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారి డి. సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని నీలకంఠపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలో ఉన్న రోగుల వివరాలు వారికి అందుతున్న సేవలు గూర్చి వైద్యాధికారి అభినవకుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగన్నదొర వలస గ్రామంలో ఫోకల్ స్ప్రే జరిగిన విధానాన్ని నాణ్యతను పరిశీలించి అక్కడ ప్రజలకు దోమల ఉనికిని, పెరుగుదలకు గల కారణాలు గూర్చి తెలియజేసి దోమ తెరలను అందరూ తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, మలేరియా సూపర్‌వైజర్‌లు శ్రీహరిరావు, కేశవ నాయుడు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారి

తాగునీటి సమస్య పరిష్కారానికే క్రాష్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించామని ఎంపిపి కే.దీనమయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ వేసవి కాలంలో ప్రజలకు మంచినీటిని తాగేందుకు ఎట్టి పరిస్థితులల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను ఇటువంటి క్రాస్ ప్రోగ్రామ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలో ఉన్న 27 పంచాయతీల్లో ఎక్కడైనా మంచినీటి చేతి పంపులు గానీ, బోర్లు గానీ పాడైతే తక్షణమే సంబంధిత సచివాలయ సిబ్బందికి గాని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలన్నారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ కురుపాం సబ్ డివిజన్ డిఇ కే. నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో మంచినీటి చేతిపంపులు రక్షిత మంచినీటి పథకాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా కొత్త చేతి పంపులు, బోరు గొట్టాలు తదితర సామాన్లు అందుబాటులో ఉంచామన్నారు. ఈ క్రాస్ ప్రోగ్రాం సుమారు నెలరోజుల పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి జగదీష్ కుమార్, ఎఇ ప్రవీణ్ కుమార్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

ఈనెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు, వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని ఎంపిపి దీనమయ్య, ఎంపిడిఒ జగదీష్ కుమార్‌లు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమ సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశమంతటా ఈనెల 3న నిర్వహించనున్న చిన్నారులకు పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం విజయవంతం చేయాలన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి వైద్య సిబ్బందికి నిర్దేశించిన ప్రకారం ఆయా కేంద్రాల వద్దకు చేరుకొని చిన్నారులకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం. బుద్దేశ్వర రావు, పాల్గొన్నారు.

క్రాష్ ప్రోగ్రామ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి దీనమయ్య

వైసిపి, టిడిపి విధానాలను తిప్పికొట్టండి

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలో బిజెపితో దోస్తీ రాష్ట్రంలో కుస్తీ దీనివల్ల మన రాష్ట్రానికి ద్రోహం చేసేలా ఈ మూడు పార్టీల విధానాలు ఉన్నాయని, వీటిని తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిరా పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా గోడ పత్రికను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు ఈ మూడు పార్టీలు మద్దతు పలుకుతూ రాష్ట్రంలో కుస్తీ పట్టేలా నటిస్తున్నాయని, కావున ప్రజలు ఈ పార్టీలను నమ్మొద్దు అన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న బిజెపికి మద్దతు పలికేలా ఉన్నాయని తెలిపారు. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై బిజెపి ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తుందని, ఇప్పటికే పోలీసు కాల్పుల్లో ఓ రైతు మృతిచెందగా, అనేక మంది గాయాలపాలయ్యారన్నారు. ఈ మూడు పార్టీలు దీనిపై స్పందించిన పరిస్థితి నేటికీ లేకపోవడం అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తగాదాలు పక్కనపెట్టి పార్టీలన్నీ ముందుకు అన్ని వచ్చేలా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రామారావు వెంకటేశు, పెంటయ్య, రామయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పావని కోరారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బజారు వరకు ర్యాలీని నిర్వహించారు. పల్స్ పోలియోను పోలియో చుక్కలతో పోలియోను నివారించాలి. దేశాన్ని ఆరోగ్యవంతంగా ఉంచాలంటూ నినాదాలు చేశారు. అలాగే పెదంకలాం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, ఇఒ జి.సూర్యనారాయణ, హెచ్‌డి వరలక్ష్మి, డి.సత్యవతి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

వారంలో పనులు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

అడలి వ్యూ పాయింట్ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం ఆడలి వ్యూ పాయింట్ వద్ద జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యూ పాయింట్ వద్ద సుందరీకరణ పనులను ప్రారంభించాలని ఉద్యాన శాఖాధికారికి సూచించారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇఇ సింహాచలం, ఎలక్ట్రికల్ ఇఇ గోపాలకృష్ణ, పిహెచ్ఒ గణేష్, ఎఇనాగభూషన్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాక్షస పాలనకు చరమగీతం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి రాక్షస పాలనకు ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో చరమ గీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని కురుపాం నియోజకవర్గం టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని చినమేరంగిలో మాజీ మంత్రి విజయరామరాజు నివాస గృహ ప్రాంగణంలో శుక్రవారం టిడిపి, జనసేన క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జిలు, ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంతవరకు ఒక్క రహదారి కూడా నిర్మించకుండా ఇప్పుడు ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో హడావుడిగా రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్నారని అందులో కొన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు కూడా ఈమే శంకుస్థాపన చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కష్టపడి పనిచేసి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు

సాలూరురూరల్: మండలంలోని తోణాంలో శుక్రవారం సాయంత్రం వైసిపికి చెందిన కుటుంబాలు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన 30 కుటుంబాలు ముద్దల భాస్కరరావు, మీసాల రాజు ఆధ్వర్యాన వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఇన్‌ఛార్జి సంధ్యారాణి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, నాయకులు మత్స శ్యాం, అక్కేన తిరుపతిరావు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మాట్లాడుతున్న జగదీశ్వరి

సూపర్ సిక్స్‌పై ప్రచారం

పార్వతీపురంరూరల్: తెలుగుదేశం- జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలపై శుక్రవారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గతంలో పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి స్తబ్ధితుగా ఉన్న వర్గాలను ఇంటింటికి వెళ్లి కలిసి రాబోయే క్రియాశీలకంగా వ్యవహరించి స్తబ్దతగా ఉన్న వర్గాల ఇంటింటికి వెళ్లి కలిసి రాబోయే కాలంలో సంపూర్ణంగా ప్రజల మద్దతు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రిస్టియన్ సంఘాలను కలిసి తమ పార్టీకి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు జి.రవికుమార్, నాయకులు బర్నాల సీతారాం, మంచిపల్లి సత్యనారాయణ, పాలకొండ రాజశేఖర్, మజ్జి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తు గ్యారంటీ

సీతంపేట: మండలంలోని కొండసొర్లంగి, గులుమూరు గిరిజన గ్రామాల్లో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి జయకృష్ణ మాట్లాడుతూ ఈ అసమర్థ ప్రభుత్వం వల్ల మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, టిఎన్‌టియుసి నాయకులు నివార్తి శేశి, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, సవర మోహన్, సవర సూర్య, సవర రాము, సవర క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నదొరకు రైతుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి- సాలూరు

ఎపి సీడ్స్‌కు విత్తన ధాన్యం విక్రయించిన రైతులకు అడ్వాన్స్ చెల్లింపుల విషయంలో కృషి చేసిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకు స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రైతులు రాజన్నదొరని ఆయన నివాసంలో కలిసి హర్షం వ్యక్తం చేశారు. రైతులకు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తం విడుదలలో తీవ్ర జాప్యం జరగడంతో ఆందోళన చెంది డిప్యూటీ సీఎం రాజన్నదొరకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బకాయి పడిన రైతులకు అడ్వాన్స్ చెల్లింపుల కోసం రూ.15కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

మహారాజశ్రీ పార్వతీపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 21/2023

Between :
నారికేలపు వెంకటరమణ ...వాది
And :
మరుకుర్తి చిన్నారావు .....ప్రతివాది

వాది తరుపున కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ఇవ్వబడిన పత్రిక ప్రకటన

To.
శ్రీ మరుకుర్తి చిన్నారావు, తండ్రి లేటు సోమరాజు, హిందూ, కంచరవీధి, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా అను వారికి.

మీపైని యిందుల వాదిగారు తనకు మీ వలన తే.15-09-2021ది గల ప్రామిసరీ నోటు ప్రకారం మీరు చెల్లించవలసిన అసలు, వడ్డీలు రాబట్టే నిమిత్తం పై కోర్టులో O.S.21/2023గా దావా వేసియున్నారు. మీ ఆస్తులను ప్రథమ జప్తు గావించమని కోరుచూ I.A.48/2023గా జప్తు పిటిషన్ దాఖలు చేసియున్నారు. గత చాలాకాలంగా మీరు కోర్టువారు పంపించిన నోటీసులకుగాని, సమన్లకుగాని స్పందించ లేదు. కాబట్టి శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం **తే.06-03-2024ది నాడు ఉదయం 10:30గంటల**కు ఖుద్దున గాని, మీ వకీలుగారి ద్వారా గాని కోర్టుకు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమున దావా డిక్రీ కాబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

ఇట్లు
బెలగాం శివానందరావు,
బి.ఎ., బి.ఎల్.,
అడ్వకేట్, పార్వతీపురం,
సెల్: 9441909649

భద్రగిరి ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప చికిత్స బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులు పొందుతున్న సేవలు, రోజువారి ఒపి, బెడ్‌లు పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, వార్డుల పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో రోగులకు సేవలు అందించాలని సంబంధిత వైద్యులకు సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనాలు ఇంకా నిర్మాణంలో ఉన్నాయని బృందానికి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాయకల్ప జిల్లా అధికారి జి నాగభూషణరావు, స్టేట్ కన్సల్టెంట్ జి జగన్ మోహన్, జిల్లా కన్సల్టెంట్ వై శ్యామ్ రిచార్డ్, భద్రగిరి వైద్యులు రవికుమార్ సిబ్బంది ఉన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని చిన్నమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కాయకల్ప స్పెషల్ ఆఫీసర్, పాలకొండ సిహెచ్సి మెడికల్ సూపరింటెండెంట్ జి. నాగభూషణరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా ఆరోగ్య కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, గార్డెన్ అభివృద్ధిపై వైద్యాధికారి సునీల్ కుమార్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఎంసి వైద్యులు డాక్టర్ ఎల్పీ స్వామి నాయుడు, డాక్టర్ అన్నాజీ రావు, డాక్టర్ చంద్ర వర్మ, డాక్టర్ రమ్య, డాక్టర్ అనిల్ చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిన పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ఎన్‌సిఆర్‌టి బృందం పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట మండల పరిషత్, ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం ఎన్‌సిఆర్‌టి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ అమలు చేస్తున్న గోరుముద్ద, నాడు నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి నుంచి సమాధానం రాబట్టి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిఇఒ ఆఫీస్ ఎఎస్ఒ శంకర్రావు, ఎంఇఒలు జి.సూరి దేముడు, హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల యోగాను పరిశీలిస్తున్న సభ్యులు

రైతుల అవసరాలను తీర్చే నానో టెక్నాలజీ

ప్రజాశక్తి - పాచిపెంట

రోజు రోజుకు మారుతున్న సాగు పద్ధతులను మరింత సరళంగా మార్చుకోవడానికి నానో టెక్నాలజీ ఎంతో అవసరమని ఎం కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని గడివలసలో నానో యూరియా, డిఎపిలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యూరియాను వాడే ముందుగా సీసాను బాగా కలపాలని, లీటరు నీటికి 2-4 మిల్లీ లీటర్ల కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం ఎండ వేడిమి తక్కువగా ఉన్నప్పుడు పిచికారి చేసుకోవాలని, పురుగు మందులతో పాటు, ఇతర నీటిలో కరిగే ఎరువులతో పాటుగా కలిపి పిచికారీ చేసుకోవచ్చునని చెప్పారు. పర్యావరణానికి నీటి ఆవరణలకు భూమికి ఎలాంటి హాని జరగదని చెప్పారు. ఎన్నో ఉపయోగాలున్న నానో యూరియా, డిఎపి రాబోయే ఖరీఫ్ సీజన్ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో విఎఎ అశ్విని, లావణ్య, పాల్గొన్నారు.